క్లుప్తంగా

వీరంకికి సామాజిక సేవా పురస్కారం



జి.కొండూరు: మండల పరిధి కోడూరు గ్రామానికి చెందిన రంగస్థల, సినీ నటుడు వీరంకి వెంకట నరసింహారావుకు రితిక ఫౌండేషన్ వారి సామాజిక సేవా పురస్కారం లభించింది. విజయవాడలోని ఆర్మీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సినీ నటి జగదేశ్వరి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకట నరసింహారావు మాట్లాడుతూ దశాబ్దాలుగా కళారంగానికి చేసిన సేవలకు గాను అవార్డు లభించిందని ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు నిత్యాచారి పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్ అండ్ బీ రోడ్డు



చాట్రాయి: కోతకు గురైన ఆర్ అండ్ బీ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. చాట్రాయి సెంటర్‌లోని జనార్ధనవరం రోడ్డు వర్షాలకు కోతకు గురవడంతో వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడం, కోతకు గరవడంతో రోడ్డుపై ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించలేక పోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పెరటి మొక్కల పెంపకంపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పెరటి మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు ఆదివారం కొండపల్లి రెండో సచివాలయంలో నిర్వహించారు. సిటీ మిషన్ మేనేజర్ శ్రీధరరావు మొక్కలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పెరటి మొక్కల పెంపకానికి అవసరమైన వర్మి కంపోస్టును వంటింటి వ్యర్థాలతో తయారు చేసుకునే పద్ధతులను వివరించారు. డ్వాక్రా సభ్యులు ప్రతి ఒక్కరు ఇంట్లోనే కూరగాయలు పండించుకునే పద్ధతులపై రిసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించాలని సూచించారు. సొర, పాలకూర విత్తనాలు పంపిణీ చేశారు. మెప్మా ఉద్యోగులు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

ప్రబోధానంద బోధనలపై ప్రచారం



ముసునూరు: త్రైత సిద్ధాంతకర్త ఆచార్య ప్రబోధానంద బోధనలు పాటించాలని ఆ సమితి నూజివీడు పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. చిల్లబోయినపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నందిగామ రూరల్: రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర చరిత్ర కలిగిన వారు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఘర్షణలు, వివాదాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా సహించేది లేదన్నారు. నేర జీవితాన్ని విడనాడి కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవనం సాగించాలని సూచించారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని చెప్పారు. అనంతరం నేరాలకు పాల్పడబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐ అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

నడిచేందుకూ నరకయాతనే!

- బురదమయంగా జాతీయ రహదారి
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో పొలాన్ని తలపిస్తున్న జాతీయ రహదారి

తిరువూరు: ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారి ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచేందుకూ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా పనులు పూర్తి చేయడంలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఉదాసీన వైఖరి అనుసరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ రహదారి నిర్మాణ సమయంలో విస్తరణ నిమిత్తం రామచంద్రాపురంలో ఇరువైపులా నివాస గృహాలను కోల్పోయే కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో ఏర్పడిన వివాదం పరిష్కరించడంలో జిల్లా యంత్రాంగం సైతం ప్రకటనలకే పరిమితమైందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్, కలెక్టర్, ఆర్డీఓలు పలుమార్లు ఈ రహదారిని సందర్శించి చర్యలు తీసుకుంటామని ప్రకటించినా తదుపరి కార్యాచరణ లోపించిందని ప్రజలు విమర్శిస్తున్నారు.



రామచంద్రాపురంలో బురదలోనే వాహనాల రాకపోకలు

టోల్ ఫీజు వసూళ్లతో సరి...

జాతీయ రహదారిపై రామచంద్రాపురం సమీపంలో బాడవ టోల్‌గేట్ వద్ద నిత్యం లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న జాతీయ రహదారుల విభాగం రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. నిలువెత్తు గోతులున్న రామచంద్రాపురం గ్రామంలో జాతీయ రహదారిపై రాకపోకల సందర్భంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఈ రహదారిని సందర్శించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తామని ప్రకటించి చెరువులోని బురదమట్టితో గుంతలు పూడ్చించారని, గతంలో కంటే రోడ్డు అధ్వానంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బురదమయంగా జాతీయ రహదారి



ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పూర్తిగా గుంతలమయమై ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో ఈ రహదారిపై కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి. ఇటీవల గుంతల్లో పోసిన మట్టి బురదమయమై జారిపడిపోతున్నాం. జాతీయ రహదారి నిర్మాణం గురించి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– రామలక్ష్మారెడ్డి, రామచంద్రాపురం

అధికారుల నిర్లక్ష్యం



జాతీయరహదారి నిర్మాణ సమయంలోనే అధికారుల నిర్లక్ష్యంతో రామచంద్రాపురంలో పనులు నిలిచిపోయాయి. గత పది సంవత్సరాలుగా ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయాలనే ఆలోచన అధికారులకు కలగకపోవడం విచారకరం. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ఈ రోడ్డుపైనే పలుమార్లు తిరువూరు నియోజకవర్గానికి రాకపోకలు సాగిస్తున్నా గుంతలు కనిపించకపోవడం శోచనీయం.

– శివారెడ్డి, వైస్ ఎంపీపీ, ఎ.కొండూరు

ప్రభుత్వ వైఫల్యాలు ఇంటింటికీ వివరించండి

మాజీ మంత్రి జోగి రమేష్



పైడూరుపాడు సమావేశంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న జోగి రమేష్, నాయకులు



కేతనకొండ సమావేశంలో మాట్లాడుతున్న జోగి రమేష్

విజయవాడ రూరల్: ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి కార్యకర్తలు ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షుడు రవికిశోర్ అధ్యక్షతన ఆదివారం పైడూరుపాడులో సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జోగి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఏడాదిలో ఆ కుటుంబం ఎంత నష్టపోయిందో తెలియజేసే విధానంపై అవగాహన కల్పించారు. ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పింఛన్, షరతులు లేకుండా తల్లికి వందనం, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలైన పథకాలు కూటమి ప్రభుత్వం అమలు చేయని తీరు, చంద్రబాబు మోసంతో మారిన పేదల ఆర్థిక స్థితిగతులను వివరించారు. సీఎం చంద్రబాబు పేదలను మోసం చేయడంలో దిట్ట అని విమర్శించారు. గత ఎన్నికల్లో కూటమి మూడు పార్టీలు కలిసి పోటీ చేయగా, సింగిల్‌గా పోటీ చేసి 40 శాతం ఓటింగ్ సాధించిన ఘనత జగనన్నదని కొనియాడారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తామని, కార్యకర్తలకు అన్యాయం జరిగితే సమైక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని టీడీపీ సర్వేలోనే తేలిందని చెప్పారు. గ్రామ, మండల స్థాయి కమిటీలు, కార్యకర్తలు, వివిధ విభాగాల నాయకులు నిబద్ధతతో చంద్రబాబు మేనిఫెస్టో వైఫల్యాలు వివరించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంచన చంద్రబాబు నైజం..

ఇబ్రహీంపట్నం: ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను వంచించడం చంద్రబాబు నైజమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. మండల స్థాయి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం కేతనకొండలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రెంటపల్లి నాగరాజు అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగింది. తొలుత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెస్తూ డిజిటల్ స్కీన్‌పై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే విధానం, స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసే విధానం, గ్రామాల్లో ప్రజలకు వివరించే పద్ధతులను పట్టణ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి వివరించారు. జోగి రమేష్ మాట్లాడుతూ జగనన్నతోనే సంక్షేమం వెల్లివిరిసి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలను నమ్మించి 145 హామీలు గుప్పించిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ప్రజలను వంచించారని, వంచన ఆయన నైజమని చెప్పారు. రానున్న జగనన్న 2.0లో కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి క్యూఆర్ కోడ్ స్కాన్ పత్రాలు ఆవిష్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, సర్పంచులు ఎస్.నళినీ ఆశాలత, చింతల భూలక్ష్మి, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సువర్ణరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, ఐటీ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, జిల్లా కార్యదర్శి శరభయ్య, మండల ఉపాధ్యక్షుడు నర్రా విజయ్‌బాబు, బొంతా సాంబశివరావు, మాజీ సర్పంచి అంకసాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా ఊరచెరువు అభివృద్ధి పనులు

సీపీఐ పట్టణ ప్రధాన కార్యదర్శి జూనెబోయిన

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఊర చెరువు అభివృద్ధి పనులు నాసిరకంగా చేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాస్తవానికి పనికి అయిన ఖర్చు సగంలోపే అని, రాజమార్గం ద్వారా టెండర్‌దారునికి రెడ్ కార్పెట్ పరిచి దోచి పెడుతున్నారని సీపీఐ పట్టణ ప్రధాన కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణం మధ్యలో ఉన్న ఊర చెరువు కింద సుమారు 304 ఎకరాల ఆయకట్టు సాగు అవుతుందని తెలిపారు. చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వివిధ ఫండ్స్ ద్వారా సుమారు రూ.5 కోట్ల పనులను టెండర్‌దారునికి అప్పగించారన్నారు. ఈ పనులు నాసిరకంతో, అవగాహన రాహిత్యం వలన అసంపూర్తిగా చేశారని తెలిపారు. దీని వలన చెరువు పరిసర ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న వర్షానికి సైతం చెరువు గోడ వెంబడి నీరు నిల్వ ఉండటం, పూర్తిస్థాయిలో నిర్మించని చెరువు గట్టు వలన దాని అంచులతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

చెరువు వద్ద చెట్లు పూర్తిస్థాయిలో పెంచడంలేదని, స్ట్రీట్ లైట్లు కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇంతపెద్ద అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపం కనపడుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు టెండర్‌దారునితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సచివాలయ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేనతకొండ గ్రామాభివృద్ధికి ఆరేళ్ల పాటు సహకారం అందించి బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులను సర్పంచి ఆశాలత ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సచివాలయ ఉద్యోగులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, మాజీ సర్పంచి పత్రి లేపాక్షిరావు, మాజీ ఎంపీటీసీలు సంజీవరావు, పుల్లారావు, గోపాలరావు, ముత్యార్ మియా, పులి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజలకు తెలియజేద్దాం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



తిరువూరు సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: ఎన్నికల్లో గెలుపు కోసం అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖం చాటేస్తున్న కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరువూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు కోరారు. తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్ అధ్యక్షతన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. సూపర్ సిక్స్ పథకాలతో పాటు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను మరింత ఎక్కువగా ప్రజలకందిస్తామని బాండ్లు రాసి మరీ ప్రజలను నమ్మించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి భాగస్వామ్య పార్టీలు ఏడాదిన్నర కావస్తున్నా అమలు చేసే ఉద్దేశ్యం కనిపించడం లేదని స్వామిదాసు విమర్శించారు. కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టేందుకు కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలతో మమేకం కావాలని, కూటమి ఇచ్చిన హామీలు, అమలు కాని పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నాయకులు యరదేశి రామారావు, మామిడి కుటుంబరావు, ముక్కామల సీతారామయ్య, చెన్ను కృష్ణప్రసాద్, గొర్ల నర్సిరెడ్డి, కొమ్మినేని కిశోర్, బండి రవికుమార్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండ



బాసవరప్పాడులో పార్టీ కార్యకర్తలను పరామర్శిస్తున్న ప్రతాప్ అప్పారావు

ముసునూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఇటీవల మోకాలికి ఆపరేషన్ చేయించుకున్న మండలంలోని బాసవరప్పాడు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ముప్పా కృష్ణారావు, కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్న తలకొండ ప్రభాకర్, రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందిన తలకొండ లక్ష్మణరావు, ముప్పా సీతామహలక్ష్మీలను ఆదివారం పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు మూల్పూరి నాగమల్లేశ్వరావు, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, ఉప సర్పంచ్ ముప్పా బాబూరావు, నాయకులు ముప్పా శ్రీనివాసరావు, బండారుపల్లి నరేష్, పొన్నగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె



పాతరావిచర్లలో అంకమ్మ తల్లికి సారె సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు



నూజివీడులోని బొందిలిపేటలో శాకంబరిగా దర్శనమిచ్చిన గంగానమ్మ తల్లి

నూజివీడు: ఆషాఢ మాసం నాలుగో ఆదివారాన్ని పురస్కరించుకుని పట్టణం, మండలంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. పాత రావిచర్లలోని అంకమ్మ తల్లి ఆలయంలో గ్రామానికి చెందిన మహిళలు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బొందిలిపేటలో ఉన్న గంగానమ్మ గుడిలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించడంతో శాకంబరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. బొందిలిపేట, ఎంప్లాయీస్ కాలనీలకు చెందిన మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల కోలాహలం



నిమ్మకాయ పూజ చేయించుకుంటున్న భక్తులు



సారె తెస్తున్న సర్పంచ్ లావణ్య, భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు ఆషాఢ మాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

అమ్మవారికి సారె సమర్పణ

పెనుగంచిప్రోలు: ఆషాఢ మాసం సందర్భంగా గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారికి శనివారం మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన భక్తులు సారె సమర్పించి బోనాలు చెల్లించారు. అమ్మవారికి సారె సమర్పణ అనంతరం వారికి వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గూడపాటి లావణ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఉప సర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రవి కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతులకు వడ్డీ రాయితీ చెల్లించాలి

ఇబ్రహీంపట్నం: సహకార బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నాలుగు శాతం వడ్డీ రాయితీ వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందరావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సహకార బ్యాంకులు ఏడు శాతం వడ్డీపై రైతులకు పంట రుణాలు ఇస్తున్నాయన్నారు. సకాలంలో రెన్యూవల్ చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం మూడు శాతం, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు శాతం వడ్డీ రాయితీ చెల్లించాల్సి ఉందని చెప్పారు. కేంద్రం మూడు శాతం వడ్డీ ఇప్పటికే చెల్లించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు శాతం వడ్డీ రాయితీ రైతుల ఖాతాలకు జమ చేయలేదని విమర్శించారు. మంత్రి కింజారపు అచ్చంనాయుడు జోక్యం చేసుకుని రాయితీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించి గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపుతామని చెప్పారు.